శాస్త్రోక్తంగా యాదగిరీశుడి నిత్య తిరుకల్యాణం

యాదగిరిగుట్టలో స్వామివారి నిత్య కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జనవరి 20 : యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామి నిత్య తిరు కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. శనివారం ఉదయం స్వామివారికి సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు కల్యాణమూర్తులకు గజ వాహన సేవ నిర్వహించారు. వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హవనం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవ సేవ జరిపారు. స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణ తంతు జరిపారు. విశ్వక్సేనారాధన, స్వస్తీవాచనం కార్యక్రమాలతో కల్యాణాన్ని ప్రారంభించారు. సుమారు గంటన్నర పాటు సాగిన వేడుకల్లో భక్తులు పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం భక్తులు నారసింహుడిని దర్శించుకున్నారు. స్వామివారి నిత్యోత్సవాలు తెల్లవారుజాము నుంచే మొదలయ్యాయి. ఉదయం సుప్రభాత సేవతో నారసింహుడిని మేల్కొలిపిన అర్చకులు తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు తిరువీధి సేవోత్సవం నిర్వహించారు. భక్తులు దర్బార్ సేవలో పాల్గొని తరించారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన జరిపారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలు వైభవంగా జరిగాయి. స్వామివారిని సుమారు 16 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.27,69,587 సమకూరినట్లు ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

స్వామివారి సేవలో ప్రముఖులు..

స్వామివారి కల్యాణంలో జిల్లా అదనపు న్యాయమూర్తి మారుతీదేవి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. అలాగే సీఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకుని నిత్య తిరుకల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం పంచనారసింహుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ అర్చకులు సంప్రదాయ స్వాగతం పలికి దర్శనం అనంతరం వేద ఆశీర్వచనం చేసి ప్రసాదం అందజేశారు.

అధిక కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

భువనగిరి అర్బన్, జనవరి 20 : మార్చి 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు అధికంగా పరిష్కారమయ్యేలా కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.జయరాజు అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రిమినల్ కేసుల పరిష్కారంలో జాప్యం జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన వారికి న్యాయ సహాయం, ఖైదీల క్రిమినల్ కేసులపై పునఃసమీక్ష నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు. సమావేశంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.మారుతిదేవి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.దశరథ రామయ్య, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్‌రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.కవిత, క్రైం బ్రాంచ్ డీసీపీ అరవింద్‌బాబు, భువనగిరి ఏసీపీ వెంకట్‌రెడ్డి, భువనగిరి సబ్ జైలు పర్యవేక్షణాధికారి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత

● బీబీనగర్ జడ్పీటీసీ ప్రణీతాపింగళ్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న బీబీనగర్ జడ్పీటీసీ గోలి ప్రణీతాపింగళ్‌రెడ్డి

బీబీనగర్, జనవరి 20 : బాలికల సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని బీబీనగర్ జడ్పీటీసీ గోలి ప్రణీతాపింగళ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ, ఆశకార్యకర్తలు భ్రూణ హత్యల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆడపిల్లలు సమాజానికి మణిహారం అని, వారి బంగారు భవితకు పునాదులు వేయాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లగారి భాగ్యలక్ష్మీశ్రీనివాస్, ఉపసర్పంచ్ ఎండీ దస్తగిరి, జిల్లా మహిళా సాధికారత బృందం సభ్యులు నిఖిత, భార్గవి, మనీషా, వార్డు సభ్యులు రొడ్డ యమున, సామల వేణు, పొట్ట అంజి, టంటం రాఘవేందర్, రొడ్డ శ్రీను, ఎలుగుల నరేందర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.



నాగారంలో బీమా చెక్కులను అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

కార్యకర్తలకు అండగా ఉంటాం

● మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

వలిగొండ, జనవరి 20 : కార్యకర్తల కుటుంబాలకు బీఆర్ఎస్ ఎల్లవేళలా అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని నాగారం గ్రామానికి చెందిన బండ అంజయ్య, జంగమ్మ దంపతులు విద్యుదాఘాతకంతో ఇటీవల మృతి చెందగా.. బీఆర్ఎస్ సభ్యత్వ బీమా ద్వారా ఇద్దరికి రూ.2లక్షల చొప్పున మంజూరైన చెక్కులను శనివారం వారి కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మొగుళ్ల శ్రీనివాస్, పల్సం రమేశ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎల్లంకి స్వామి, వల్లమాల కృష్ణ, సలీం, గ్రామశాఖ అధ్యక్షుడు నాగార్జున, సత్తయ్య, మారయ్య పాల్గొన్నారు.

నర్సింహ కుటుంబానికి పరామర్శ

బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు ఎడవెల్లి శాంతికుమార్ తండ్రి ఎడవెల్లి నర్సింహ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి శనివారం నర్సింహ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

● ఆర్టీఓ రవీందర్

యాదగిరిగుట్ట, జనవరి 20 : వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఆర్టీఓ ఘంటా రవీందర్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపోలో ఉద్యోగులకు ప్రమాదాల జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. డ్రైవర్లు సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడుపరాదని సూచించారు. మద్యం సేవించి నడపడం వల్లే ఎక్కువ శాతం ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలిపారు. డిపో మేనేజర్ శ్రీనివాస్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ హుస్సేన్, అసిస్టెంట్ ఇంజినీర్ హనుమానాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యను సన్మానిస్తున్న కురుమ సంఘం నాయకులు

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు సన్మానం

భువనగిరి కలెక్టరేట్, జనవరి 20 : పట్టణ పరిధిలోని రాయగిరి లింగబసవ గార్డెన్స్‌లో శనివారం కురుమ సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ కురుమలు చదువుతో పాటు మంచి ఉన్నత స్థాయిలకు ఎదుగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యాదగిరిగుట్ట ఎంపీపీ చీర శ్రీశైలం, జడ్పీటీసీలు బీరు మల్లయ్య, తోట కూర అనూరాధ, కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు క్యామ మల్లేశం, ఉపాధ్యక్షుడు జూకంటి రవీందర్, జిల్లా అధ్యక్షుడు గవ్వల నర్సింహులు, ప్రధాన కార్యదర్శి కాదూరి అచ్చయ్య, ర్యాకల శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి డోకె బాలకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు జాన సత్యనారాయణ, పెరపు రాములు, బండి వెంకటేశ్, గౌరవ సలహాదారుడు మోటె బుచ్చయ్య, జిల్లా కోశాధికారి చిన్నం బాల రాజు, సహాయ కార్యదర్శి ఒగ్గు మల్లేశం పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కల్నల్ అజయానంద్ ఖండూరి

విద్యార్థులు ఎన్‌సీసీలో చేరేలా ప్రోత్సహించాలి

● 10వ బెటాలియన్ కమాండింగ్ అధికారి అజయానంద్ ఖండూరి

ఆలేరు, జనవరి 20 : విద్యార్థులు ఎన్‌సీసీలో చేరేలా అధ్యాపకులు ప్రోత్సహించాలని వరంగల్ 10వ బెటాలియన్ కమాండింగ్ అధికారి కర్నల్ అజయానంద్ ఖండూరి అన్నారు. శనివారం ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆలేరు జడ్పీహెచ్ఎస్ ఎన్‌సీసీకి మంచి పేరు పొందిందన్నారు. ఎన్‌సీసీలో చేరేందుకు విద్యార్థులు ఉత్సాహం చూపుతున్నారని, వారికి ఉద్యోగ అవకాశాల్లో స్థానం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి దూడల వెంకటేశ్, ప్రధానోపాధ్యాయురాలు శ్యామసుందరి పాల్గొన్నారు.

నక్క బాటలో ఇళ్ల నిర్మాణంపై కొనసాగుతున్న సర్వే

యాదగిరిగుట్ట, జనవరి 20 : మండలంలోని మల్లాపురంలో నక్క బాటలో ఇళ్లు నిర్మాణం చేపట్టారన్న ఫిర్యాదుపై తాసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీఓ చంద్రశేఖర్ శనివారం సర్వే నిర్వహించారు. సర్పంచ్ కర్రె వెంకటయ్య రైతు వేదిక పేరుతో 20 గుంటల రెవెన్యూ నక్షబాటను కబ్జా చేసి అక్రమంగా ఇళ్లు నిర్మాణం చేపట్టారని మాజీ సర్పంచ్ మంగ సత్యనారాయణ ఇచ్చిన పిర్యాదుపై క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. సర్వేయర్లతో కలిసి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చుట్టూ పక్కల గల సర్వే నంబర్లలో పూర్తిస్థాయి సర్వే చేపట్టామని వెల్లడించారు. సోమవారం జిల్లా అధికారులకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ విజయసింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఊపేశ్, సర్వేయర్ దేవానాయక్ పాల్గొన్నారు.

మల్లాపురంలో వివరాలు సేకరిస్తున్న తాసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీఓ చంద్రశేఖర్

సమాచారం లేకుండా ఇండ్లు కూల్చే ప్రయత్నం

● బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకటయ్య

సర్వే చేస్తామని చెప్పి తమకు ఎలాంటి సమాచారం లేకుండానే ఇండ్లను కూల్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, సర్పంచ్ కర్రె వెంకటయ్య ఆవేదన వ్యక్తం చేశారు. నక్క బాటలో ఇళ్లు నిర్మించిన్నట్లు రుజువైతే తమకు నోటీసులు జారీ చేసి, సమాచారం అందించిన తరువాత చర్యలు తీసుకోవాలని సూచించారు. కానీ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఒత్తిడితో ఇళ్లు కూల్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తమకు అనుమానం వస్తుందన్నారు. నక్క బాటను కబ్జా చేశారన్న ఆరోపణల్లో నిజం లేదని స్పష్టం చేశారు. ఇళ్లను కూల్చివేస్తే న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు.

పాదయాత్ర నిర్వహిస్తున్న రావి నారాయణరెడ్డి సేవా సంస్థ సభ్యులు

రావి నారాయణరెడ్డి స్ఫూర్తితో ముందుకు సాగాలి

● రావి నారాయణరెడ్డి సేవా సంస్థ అధ్యక్షుడు శ్రీనివాస్

భువనగిరి కలెక్టరేట్, జనవరి 20 : రైతాంగ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ రావి నారాయణరెడ్డి స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని రావి నారాయణరెడ్డి సేవా సంస్థ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాస్ కోరారు. రావి నారాయణరెడ్డి కాంస్య విగ్రహాలను హైదరాబాద్, భువనగిరి, బొల్లేపల్లిలో ఏర్పాటు చేయాలని సంస్థ ఆధ్వర్యంలో శనివారం బొల్లేపల్లి నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సెక్రటరీ రావి సుకేశ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పడాల భాస్కర్‌రావు, జాయింట్ సెక్రటరీ హేమంత్‌రెడ్డి, ముఖ్య సలహాదారులు భువనగిరి సత్యనారాయణ, రావి ప్రతిభ, సర్పంచ్ మద్ది బుచ్చిరెడ్డి, సభ్యులు మహేశ్, విజయకుమార్, విజయభార్గవ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొయ్యలగూడెం ప్రభుత్వ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న చౌటుప్పల్ సీఐ దేవేందర్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

● చౌటుప్పల్ సీఐ దేవేందర్

చౌటుప్పల్ రూరల్, జనవరి 20 : విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని చౌటుప్పల్ సీఐ దేవేందర్ అన్నారు. శనివారం మండలంలోని కొయ్యలగూడెం జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ట్విట్టర్, ఫేస్‌బుక్, ఓటీపీ, బెట్టింగ్, ఫ్రాడ్ కస్టమర్ కేర్ తదితర వాటిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. సైబర్ నేరాలపై 1930 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పైవేట్ కళాశాలల యాజమాన్య సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శిగా మల్లేశం

భువనగిరి అర్బన్, జనవరి 20 : నల్లగొండలో శనివారం జరిగిన సమావేశంలో తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శిగా భువనగిరి పట్టణానికి చెందిన వైష్ణవి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మధిర మల్లేశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ కళాశాలల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు.

బస్వాపురంలో ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ నిర్మల

విద్యార్థులు సమాజంపై అవగాహన కలిగి ఉండాలి

● ఎంపీపీ నిర్మల

భువనగిరి కలెక్టరేట్, జనవరి 20 : విద్యార్థులు చదువుతో పాటు సమాజంపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీపీ నరాల నిర్మలావెంకటస్వామి అన్నారు. మండలంలోని బస్వాపురంలో శనివారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శీతాకాల శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆలయ పరిసరాలు, రహదారుల వెంట మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ చంద్రకళ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్‌గా ప్రమోద్

ప్రమోద్‌కు నియామక పత్రాన్ని అందిస్తున్న రమేశ్

గుండాల, జనవరి 20 : ఎమ్మార్పీఎస్(దండోర) మండల కన్వీనర్‌గా బందెల ప్రమోద్‌ను నియమించినట్లు ఆ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి క్యాసగళ్ల రమేశ్‌మాదిగ తెలిపారు. శనివారం మండలంలోని పెద్దపడిశాల గ్రామంలో ఎమ్మార్పీఎస్ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. నూతన కన్వీనర్‌గా ప్రమోద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేయకుండా మాదిగలను మోసం చేస్తుదన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నత్తి యాదగిరి, ఎర్ర నరేశ్, అన్నెపర్తి వంశీ, ప్రవీణ్, గోపాల్‌దాస్ మహేశ్, సందీప్, సైదులు పాల్గొన్నారు.

29న ఎస్ఎంసీ ఎన్నికలు

బొమ్మలరామారం, జనవరి 20 : ఈ నెల 29న మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు కాంప్లెక్స్ జీహెచ్ఎం వరలక్ష్మీ తెలిపారు. శనివారం నోటిఫికేషన్ వివరాలను పాఠశాల నోటీస్ బోర్డు, గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు తల్లిదండ్రులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, వెంకటలక్ష్మి, మహేశ్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 29న పాఠశాల యజమాన్య కమిటీకి ఎన్నికలు నిర్వహించనునట్లు ప్రధానోపాధ్యాయుడు రాజారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై పాఠశాల యజమాన్య కమిటీని ఎన్నుకోవాలని కోరారు.

ఆత్మకూరు(ఎం) : ఈనెల 29న పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల్లో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొనాలని ఆత్మకూరు(ఎం) ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆరవిందరాయుడు అన్నారు. ఒక్కో తరగతి నుంచి ముగ్గురు సభ్యులను ఎన్నుకోవాలన్నారు.

క్రీడాకారులకు జెర్సీలు పంపిణీ చేస్తున్న ఉదయ్‌గౌడ్

క్రీడాకారులకు జెర్సీల అందజేత

ఆత్మకూరు(ఎం), జనవరి 20 : మండల కేంద్రంలోని నేతాజీ యువజన మండలి క్రికెట్ క్రీడాకారులకు శనివారం యువజన మండలి సభ్యుడు లోడి ఉదయ్‌గౌడ్ జెర్సీలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతాజీ యువజన మండలి అధ్యక్ష, కార్యదర్శులు ప్రతికంఠం శంతన్‌రాజు, ఎలిమినేటి మురళికృష్ణ, వెంకన్న, రాజు, మత్స్యగిరి, మహేశ్, అనిల్, ప్రదీప్, మహేందర్, సతీశ్ పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటు నమోదు చేసుకోవాలి

ఆలేరు రూరల్, జనవరి 20 : 18ఏండ్లు నిండిన యువత ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని కొలనుపాకలో ఓటరు నమోదు శిబిరాలను ఆయన సందర్శించి పలువురు దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ నరేంద్రచారి, బీఎల్‌వోలు మామిడాల నర్సింహులు, షమీర్, అరుణ, వెంకటేశ్వర్లు, సంపత్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె విరమణ

భూదాన్‌పోచంపల్లి, జనవరి 20 : మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మెను కార్మికులు శనివారం సాయంత్రం విరమించారు. వేతనాలతో పాటు ఏరియర్స్‌ను వెంటనే చెల్లించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డిని కోరగా.. 2 నెలల్లో చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మె విరమించినట్లు కార్మికులు తెలిపారు. కార్యక్రమంలో కుక్క నరేశ్, బాలయ్య, హరికృష్ణ పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా సంక్షేమ అధికారిని అన్నపూర్ణ

దివ్యాంగులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా సంక్షేమ అధికారి అన్నపూర్ణ

భువనగిరి కలెక్టరేట్, జనవరి 20 : దివ్యాంగుల సంక్షేమ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి అన్నపూర్ణ అన్నారు. శనివారం దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ)-2024 క్యాలెండర్‌ను కలెక్టరేట్‌లో ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సురూపంగ ప్రకాశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్, మహిళా కన్వీనర్ కొత్త లలిత, నాయకులు గోపి, కార్యాలయం సూపరింటెండెంట్ శశికళ, వెంకటేశ్వర్లు, కిరణ్, మంజుల, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఆత్మకూరు(ఎం) : గీత పనివారల సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్లను శనివారం మండల కేంద్రంలోని గుర్రం యాదగిరిరెడ్డి విగ్రహం వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్ష, కార్యదర్శులు బత్తిని నరేశ్‌గౌడ్, దుర్గపతి నర్సయ్యగౌడ్, సీపీఐ జిల్లా నాయకులు ఉప్పల ముత్యాలు, మండల కార్యదర్శి జల్లి రాములు, వెంకటేశ్, సత్తయ్య, దయాకర్‌రెడ్డి, పురుషోత్తం, లాల్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

రామన్నపేట, జనవరి 20 : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతూ గురుకుల పాఠశాలలో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ శనివారం స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెద్దిరెడ్డి శంకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఆండమ్మ, భార్గవి, సంస్థ సభ్యులు గిరిబాబు, ఏల్లాచారి, శివసాయి, లింగస్వామి, సైదులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

ఆత్మకూరు(ఎం), జనవరి 20 : మండల కేంద్రంలోని రాంనగర్, ఇందిరానగర్ కాలనీల్లో ప్రజలకు అవసరమైన చోట శనివారం సర్పంచ్ జన్నాయికొడె నగేశ్ కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయించారు. విద్యుత్ స్తంభాలను మంజూరు చేసిన ట్రాన్స్‌కో డీఈ మల్లికార్జున్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ యాస లక్ష్మారెడ్డి, సత్తయ్య, మల్లేశ్, రాములు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటును పరిశీలిస్తున్న సర్పంచ్ నగేశ్

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

బొమ్మలరామారం, జనవరి 20 : ఈ నెల 13 నుంచి 17 వరకు ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలో నిర్వహించిన 67వ జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో అండర్ -14 విభాగంలో మండలంలోని చీకటిమామిడి గ్రామంలోని బీసీ గురుకులం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఫెన్సింగ్ పోటీల్లో ఎన్.సంతోశ్, పవన్, వరుణ్, లోకేశ్, చంద్రశేఖర్‌ప్రశంసాపత్రాలు అందుకొన్నారు. విద్యార్థులను బీసీ గురుకుల ప్రిన్సిపాల్ జె.స్వప్న శనివారం అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ శివకుమార్, పాల్గొన్నారు.

గురుకులలో ప్రవేశాలకు 23 వరకు గడువు

భువనగిరి అర్బన్, జనవరి 20 : గురుకుల పాఠశాలలలో 5వ తరగతిలో ప్రవేశాలకు ఈనెల 23 వరకు గడువు పొడిగించినట్లు భువనగిరి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీరామ్ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20న ముగిసిన ప్రవేశాల దరఖాస్తు గడువు తేదీని 23 వరకు పొడిగించారని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

108 వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

108 అంబులెన్స్ తనిఖీ

వలిగొండ, జనవరి 20 : మండల కేంద్రంలోని 108 అంబులెన్స్ వాహనాన్ని ఆడిటర్ ఎస్‌కే ఫయాజ్, ఈఎంఈ శివరాం శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య పరికరాలు, దస్త్రాలను పరిశీలించారు. అత్యవసర సమయాల్లో తక్షణమే స్పందించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి వారి ప్రాణాలను కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో ఈఎంటీలు సాలయ్య, సైదులు, దినేశ్, పైలెట్లు సురేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.